
గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కనులపండువగా గోదాదేవి కల్యాణం

బంజారాహిల్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి కల్యాణం చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

హోటళ్లలో రాయదుర్గం పోలీసుల తనిఖీలు

రాయదుర్గం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు హోటల్స్‌లో రాయదుర్గం పోలీసులు సోమవారం మధ్యాహ్నం సోదాలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కొంతమంది హోటల్స్‌లో మకాం వేసి జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అయితే పోలీసులకు ఆ హోటల్స్‌లో ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ సందర్భంగా సీఐ వెంకన్న మాట్లాడుతూ.. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్కూటీని ఢీకొట్టిన కారు..
మహిళకు గాయాలు

రాయదుర్గం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మణికొండ తానేషానగర్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళను రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో మహిళ తీవ్ర గాయాలకు గురైంది. వివరాల్లోకి వెళితే.. మణికొండ తానేషానగర్‌లో ఓ వ్యక్తి యూటర్న్ వద్ద కారును మలుపు తీసుకుంటుండగా అదుపు తప్పి అటుగా వచ్చిన స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న మహిళ తీవ్రంగా గాయపడింది. కారు డ్రైవ్ చేస్తున్న వ్యక్తి, స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాయదుర్గం పోలీసులు తెలిపారు. ప్రమాద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఊరెళ్లకున్నా ఉత్సాహమే..

- పలు సచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు
- పల్లెదనం ఉట్టిపడేలా సంబురాలు
- నగరవాసులను ఆకట్టుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు
- సందడిగా మారిన బస్తీలు

బంజారాహిల్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అయ్యో..! సంక్రాంతికి మా బాస్ నాకు సెలవు ఇవ్వలేదు. పిల్లలకేమో ఈ సారి మా ఊళ్లో పండుగ సంబురాన్ని చూపిస్తానని మాటిచ్చాను. కానీ కుదరలేదు. భోగి మంటలు, గొబ్బెమ్మలు, ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నలు, సన్నాయి మేళాలు.. ఇలా అన్నింటినీ వారికి దగ్గరుండి చూపించాలనుకున్నాను. నగరంలో నివసించే చాలామంది ఇలా నిట్టూర్చారు. కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాలని ఆరాటపడే వారికి, తాతయ్య, నానమ్మలను చూడాలని ముచ్చటపడే చిన్నారులకు ఇలాంటి పరిస్థితి కొంత ఇబ్బందికరమే. అయినా పండుగను ఇప్పుడు నగరంలో సైతం కొన్ని చోట్ల ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పల్లె వాతావరణానికి ఏమాత్రం తీసిపోకుండా వేడుకలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, శ్రీనగర్‌కాలనీ, మాదాపూర్ ప్రాంతాల్లో ఊరికి వెళ్లలేని వారికి కోసం పల్లె వాతావరణతో కూడిన అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఆకట్టుకునేలా రంగోళి వేడుకలు..

సంక్రాంతి అనగానే ప్రతి ఒక్కరికి గుర్తుకువచ్చేది ముగ్గులు, గొబ్బెమ్మలు. అయితే నగరంలో అపార్ట్‌మెంట్ కల్చర్ పెరగడంతో ముగ్గులు వేయాలని మనసులో కోరిక ఉన్నా అందుకు అనువైన స్థలం లేక మహిళ వెనకడుగు వేస్తున్నారు. ఇలాంటి వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు రంగోళి వేడుకలు జరుగుతున్నాయి. ఫిలింనగర్ బస్తీలతో పాటు ఇందిరానగర్, నందినగర్‌లో కొన్ని స్వచ్ఛంద సంస్థలు వారం రోజుల పాటు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆకర్షణీయమైన ముగ్గులు వేసే వారికి బహుమతులు అందజేస్తున్నారు. అంతే కాకుండా మహిళలు వేసిన ముగ్గులు మిగతావారు చూసేందుకు రాత్రి పొద్దుపోయే వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శిల్పారామంలో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆటపాటలు, జంగమదేవరుల సందళ్లు.. ఇలా ఒకటేమిటి ప్రతి ఒక్కటీ ఆకట్టుకుంటున్నాయి. వంటల పోటీలు సైతం నిర్వహిస్తున్నారు.


గంగిరెద్దుల విన్యాసాలు


శిల్పారామంలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లోని ఓ దృశ్యం

ప్రత్యేక ఆకర్షణగా పతంగులు..

సంక్రాంతి పండుగంటే యువత మది దోచే పతంగులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పది సంవత్సరాలుగా హుస్సేన్ సాగర్ తీరాన కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాలకు చెందిన పతంగులను ఇక్కడ ఎగురవేస్తుంటారు. రాత్రి సమయంలో విద్యుత్ కాంతుల గాలి పటాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. అంతేకాకుండా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కైట్, స్వీట్ ఫెస్టివల్ జరుగుతుంది. సాయంత్రం వేళ ఈ సందడి చూసేందుకు చాలా మంది అక్కడకు చేరుకుంటారు.

నాంపల్లిలో నుమాయిష్..


ఇక నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నుమాయిష్ పేరుతో ప్రత్యేక ప్రదర్శన జరుగుతోంది. షాపింగ్‌తో పాటు కొన్ని విన్యాసాలను సైతం ఇక్కడ చూడవచ్చు. సాయంత్రం వేళ నుమాయిష్‌కు వెళ్లామంటే సుమారు నాలుగు గంటల పాటు ఫుల్ టైం పాస్‌తో పాటు పిల్లల్లో నూతన ఉత్సాహాన్ని కలిగిస్తుంది.

బస్తీల్లో పల్లె వాతావరణం..

హిల్స్‌లో అనేక బస్తీల్లో పల్లె వాతావరణం కనిపిస్తోంది. ఫిలింనగర్‌లోని 18 బస్తీల్లో సంక్రాంతి వేళ హరిదాసులు, గంగిరెద్దుల సందడి నెలకొంది. బస్తీల్లో మహిళలు వేస్తున్న ముగ్గులు ఆకట్టుకుంటాయి. బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్, నందినగర్, ఉదయ్‌నగర్‌తో పాటు ఇతర బస్తీల్లోనూ పల్లె పండుగ వాతావరణం నెలకొంది.

కాలనీలు, బస్తీల్లో ఘనంగా భోగి వేడుకలు


బోరబండలో పతంగులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఎర్రమంజిల్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు


సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న 6వ నిజాం నవాబ్ రౌనఖ్

బంజారాహిల్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీల్లో భోగి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే భోగి మంటలు వేసి ప్రజలు సందడి చేశారు. మహిళలు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి సందడి చేయగా, చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ ఉత్సాహంగా గడిపారు.

కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో..

యూసుఫ్‌గూడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సోమవారం తన కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక చిన్నారులతో భోగి వేడుకలు నిర్వహించిన ఆయన వారికి పూలదండలు వేసి భోగి పళ్లు పోశారు. వెంకటగిరి శివ హైట్స్ వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్ బహుమతులు అందజేశారు.

6వ నిజాం నవాబ్ రౌనఖ్ ఆధ్వర్యంలో..

బంజారాహిల్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 25లోని 6వ నిజాం నవాబ్ రౌనఖ్ ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రిష్టియన్, ఆదివాసీలతో కలిసి సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి పటాలు ఎగురవేస్తూ యువకులతో కలిసి నవాబ్ రౌనఖ్ సందడి చేశారు.

పతంగుల పంపిణీ..

బోరబండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ తనయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వలి హుస్సేన్ బోరబండ బస్టాప్‌లో చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి.అశోక్, రజి, హిదాయత్, అనిల్, వినయ్, మున్నా, పాషా, వహిదా, మున్ని బేగం తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోతో రూపొందించిన పతంగులతో బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, బీసీ సంఘం నాయకుడు మహేశ్‌గౌడ్ తదితరులు


బేగంపేట కుందన్‌బాగ్ అపార్ట్‌మెంట్‌లో భోగి వేడుకల్లో పాల్గొన్న హైదరాబాద్ రెడ్ క్రాస్ యూత్ కన్వీనర్ మణిదీప్ తదితరులు


చిన్నారులకు భోగి పళ్లు పోసిన యూసుఫ్‌గూడ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి


ఆలయ ప్రాంగణంలో భోగి మంటలు

హనుమాన్ ఆలయంలో సుందరకాండ పారాయణం

ఖైరతాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ట జరిగి సంవత్సరం గడుస్తున్న సందర్భంగా ఖైరతాబాద్ రాజ్‌నగర్ హనుమాన్ దేవాలయంలో సుందరకాండ పారాయణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు రంగరాజాచార్యులు ఆధ్వర్యంలో బ్రహ్మణులు సుందరకాండ పారాయణం చేయగా పెద్ద ఎత్తున భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రకరకాల పూలతో అందంగా అలంకరించారు. దీంతో పాటు సోమవారం ఆలయ ప్రాంగణంలో భోగిమంటలు వేసి ఆలయంలోని దేవతా మూర్తులకు పూజలు నిర్వహించారు.

బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లను పొందుతున్న ఏ వర్గానికి విధించని క్రిమి లేయర్‌ను బీసీలకే విధించడం ఏమిటని.. దీన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాముని సుదర్శన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బలమైన బీసీ ఉద్యమం చేపడితే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి పలు పథకాలను ప్రవేశపెడుతుందని సూచించారు. రిజర్వేషన్లు పెట్టింది పేదరిక నిర్మూలన కోసం కాదని సామాజిక అభివృద్ధి కోసమేనని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.


పీజేఆర్ క్రికెట్ కప్‌లో మొదటి, రెండవ బహుమతి పొందిన విజేతలతో పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ విజయారెడ్డి

పీజేఆర్ టోర్నమెంట్ విజేత 'సీసీ' జట్టు

ఖైరతాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎల్పీ నేత, దివంగత పి.జనార్ధన్‌రెడ్డి జయంతి సందర్భంగా ఖైరతాబాద్ శాఖా మైదానంలో జరిగిన పీజేఆర్ కప్ క్రికెట్ పోటీల్లో మాసాబ్‌ట్యాంక్‌కు చెందిన సీసీ టీం విజేతగా నిలిచి రూ.25 వేల నగదు బహుమతితో పాటు కప్‌ను సొంతం చేసుకుంది. శాఖా స్ట్రైకర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఉదయం నుంచి డే అండ్ నైట్‌లుగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో జంట నగరాలకు చెందిన 66 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో సనత్‌నగర్‌కు చెందిన టిల్లు టీంతో ఫైనల్‌లో పోటాపోటీగా తలబడ్డ మాసాబ్‌ట్యాంక్ సీసీ టీం విజేతగా నిలిచింది. మొదటి స్థానానికి రూ.25 వేల నగదు బహుమతిని, రెండవ బహుమతిగా 10 వేల రూపాయల నగదు బహుమతితో పాటు మెడల్స్‌ను, కప్‌లను అందజేశారు. వీటిని విజేతలకు పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఉత్తమ ఆటగాళ్లకు ప్రత్యేకంగా బహుమలు అందించారు. కాగా, ప్రతిఏటా పీజేఆర్ జయంతి, వర్ధంతులకు వేరువేరుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి బహుమతులు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది.

కూరగాయల సాగుకు 50శాతం సబ్సిడీ!

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగు దిశగా ఆలోచిస్తున్న రైతులకు ఇది శుభవార్తే! కూరగాయల సాగు విస్తీర్ణం పెంపు, నాణ్యమైన తీగజాతి కూరగాయల ఉత్పత్తి, తద్వారా రైతులు స్వయం సమృద్ధి సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కూరగాయలు సాగు చేసే రైతులకు వారి క్షేత్రాల్లో శాశ్వత పందిళ్లు, సాగు పరంగా మౌలిక సదుపాయాల కల్పనకు 50శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులను వినియోగించాలని సంకల్పించింది. ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో అమలు చేయాలని నిర్ణయించింది. పథకంపై అక్కడి రైతులూ ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే 360 దరఖాస్తులొచ్చాయి. వీరికి బోధన్ మార్కెట్ కమిటీ నుంచి సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. సాధారణంగా వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై మార్కెటింగ్‌శాఖ ఒక శాతం మార్కెట్ సెస్ వసూలు చేస్తుంది. ఈ నిధులను ఎక్కడికక్కడ మార్కెట్ కమిటీలు వసూలు చేస్తాయి. వీటితో ఆయా మార్కెట్ పరిధిలో బహిరంగ ప్లాట్‌ఫామ్‌లు, కవర్ షెడ్లు, గోదాములు, అంతర్గత సీసీరోడ్లు, రైతులకు విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు నిర్మిస్తుంటారు. నీరు, విద్యుత్తు సౌకర్యాలు కల్పిస్తుంటారు. రాష్ట్రవ్యాప్తంగా 192 వ్యవసాయ మార్కెట్ కమిటీలు, 87 సబ్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. మార్కెట్ సెస్ ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో ముందుగా తీగజాతి కూరగాయల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కాకర, బీర, దొండ, సోర, చిక్కుడు తదితర కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు ఎకరాకు రూ.3లక్షల దాకా ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ పందిళ్లు ఏర్పాటు చేసుకుంటే 50శాతం సబ్సిడీ ఇస్తారు. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో ఈ పథకాన్ని చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సుదర్శన్‌రెడ్డి ముందుకొచ్చారు. నియోజకవర్గంలో క్షేత్ర పర్యటనలు చేసి రైతులతో ఆయన సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ పథకం నిర్వహణపై సుదర్శన్‌రెడ్డి స్పందించారు. శాశ్వత పందిళ్లు వేసి కూరగాయలు సాగుచేస్తే ఉత్పత్తి, నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా కైట్ ఫెస్టివల్

రెజిమెంటల్‌బజార్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కైట్ ఫెస్టివల్ భాషా సంస్కృతిక, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో అన్ని శాఖల సహకారంతో జరుగుతుంది. ఇది ఏడో కైట్ ఫెస్టివల్, ఐదవ స్వీట్ ఫెస్టివల్ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ 119 మంది కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నారు. 1300 స్వీట్ స్టాల్స్ 400 హ్యాండీ క్రాఫ్ట్ స్టాల్స్ ఉన్నాయి.

సంతోషంగా ఉంది



ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్ని రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ట్రైబల్, క్లాసికల్, పేరిణి, కూచిపూడి, భరతనాట్యం, మోహినిఅట్టం, ఒడిస్సీ, బీహూ, కథక్ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఇప్పటి వరకు జరిగిన అన్ని కైట్ ఫెస్టివల్స్‌కు నేనే డైరెక్టర్‌గా ఉండటం సంతోషంగా ఉంది.

-హరికృష్ణ మామిడి, కల్చరల్, డైరెక్టర్

చాలా ఆనందంగా ఉంది



నేను ప్రవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న. ఒక్క దగ్గర ఇన్ని రకాల కైట్‌లు చూడటం చాలా ఆనందంగా ఉంది .వెరైటీ కైట్‌లు ఎప్పుడు చూడనివి ఇక్కడ చూస్తున్నాం. గత సంవత్సరం వచ్చిన మంచిగా ఉంది. మళ్లీ ఈసారి వచ్చిన పోయిన సంవత్సరం కంటే ఇంకా బాగుంది. ఇది కండ్లకు ఒక పండుగ అని చెప్పవచ్చు.

-మౌనిక, యూసుఫ్‌గూడ

అందరికీ బాగుంది



సంక్రాంతికి ఇంటి వద్ద కైట్‌లు ఎగురవేస్తాం ఈసారి ఒకసారి చూద్దామని కైట్ ఫెస్టివల్‌కు వచ్చిన. ఇదే మొదటి సారి. చాలా బాగుంది. చూస్తుంటే అలానే చూడాలనిపిస్తుంది. ఒక్క దగ్గర ఇన్ని రకాల కైట్‌లు చూడటం చాలా సంతోషంగా ఉంది.

-మనీష్, డిగ్రీ విద్యార్థి, సఫిల్‌గూడ

ఏర్పాట్లు బాగున్నాయి



మాది కాప్రా, కైట్ ఫెస్టివల్‌కు రావడం రెండో సారి. ప్రభుత్వం ఏర్పాట్లు బాగా చేసింది. స్వీట్, ఫుడ్ స్టాల్‌లలో రేట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. కుటుంబంతో వచ్చి సరదాగా గడపవచ్చు. సంక్రాంతికి నగరంలో ఉన్న వారికి కైట్ ఫెస్టివల్‌లో సంతోషం కలిగిస్తుంది.

-పాండురంగా రావు, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్

హైదరాబాద్ చాలా ఉత్సాహానిస్తుంది

హైదరాబాద్‌లో కైట్ ఫెస్టివల్ అంటే నాకు చాలా ఉత్సాహానిస్తుంది. ఇప్పటికి ఐదు సార్లు వచ్చాను. ప్రతీసారి కైట్ ఫెస్టివల్ సరికొత్తగా ఉంటుంది. ఏర్పాట్లు బాగుంటాయి. భారత్‌లోని కేరళ తదితర రాష్ట్రాల్లో కూడా కైట్ ఫెస్టివల్‌లో పాల్గొన్నాను. మలేషియా, థాయిలాండ్ తదితర దేశాల్లో కూడా కైట్ ఫెస్టివల్‌కు హాజరయ్యాను.

- సుదేశ్, శ్రీలంక

ఆహా ఏమి రుచి...

నోరూరిస్తున్న వివిధ రాష్ట్రాల స్వీట్ స్టాల్స్

సికింద్రాబాద్ / రాంగోపాల్‌పేట్ / చిలకలగూడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, వైవిధ్యంతో కూడిన అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ సోమవారం కల్చర్, లాంగ్వేజ్, ఇండియన్ కనెక్షన్ (క్లిక్) ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో వేడుకగా ప్రారంభమయింది. ఈ స్వీట్ ఫెస్టివల్‌లో దేశంలోని 24 రాష్ట్రాల ప్రజలు తమ రాష్ట్రంలో ప్రత్యేకత కలిగిన సాంప్రదాయ మిఠాయిలను తయారు చేసి హైదరాబద్ వాసులకు రుచి చూపించారు. ఈ ప్రదర్శనలో ఆయా రాష్ట్రాల మహిళలు తమ సాంప్రదాయ దుస్తులను దరించి దాదాపు 1300 రకాల మిఠాయిలను ప్రదర్శించడంతో ఈ ప్రాంతమంతా పండుగవాతావరణం నెలకొంది. ఈ ప్రదర్శన భారతదేశ గొప్పతనాన్ని, సాంస్కృతిక వారసత్వానికి, పరస్పర సాంస్కృతిక అవగాహన పెంపొదించడానికి దోహద పడింది. ఈ ఫెస్టివల్‌లో వ్యాపారులు కాకుండ మహిళలు వారి పాక నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ లాభం కంటే వంటలపై తమకున్న ప్రేమను ప్రదర్శించారు. ఉత్తరాఖండ్ నుంచి కేరళ వరకు.. గుజరాత్ నుంచి బెంగాల్ వరకు ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రత్యేకమైన మిఠయిలను, వయస్సుతో సంబంధం లేకుండా ముసలివారు, యువతులు, బాలికలు ఇలా అన్ని వయస్సువారు తమ పాకనైపుణ్యాన్ని ప్రదర్శించారు.



బీహార్‌లో ప్రసిద్ది గాంచిన సక్రోరి

బీహర్ రాష్ట్రంలో ప్రతి పండగకు, ఫంక్షన్‌లలో తప్పని సరిగా తయారు చేసే డెసార్ట్ అని, ప్రతి ఏటా ఈ ఫెస్టివల్‌లో పాల్గొటున్నట్లు ఆ రాష్ట్రం నుంచి వచ్చిన సవిత తెలిపింది.



నాగ్‌పురీ స్పెషల్ తరిపోహ

నగ్‌పూర్‌కు ప్రత్యేకమైన వంటకం తరిపోహ. ఇది అటుకులు ఇతర పదార్థాలతో చేసే స్పెషల్ ఐటం. ఇది నాగ్‌పూర్‌లో ఎంతో ఫెమస్. ఒక్కసారి దీనిని తింటే మళ్లి మళ్లీ కావలంటారు. మరాఠా మండల్ గ్రూప్ ద్వారా ఈ స్వీట్ ఫెస్టివల్ గురించి తెలుసుకుని మొదటిసారి పాల్గొంటున్నాము.

-భారతీ ప్రకాష్



తమిళనాడు ప్రత్యేక పానియం రోస్ మిల్క్..

తమిళనాడులో ప్రత్యేక పానియంగా గుర్తింపును పొందిన రోస్ మిల్క్ తన పూర్వికుల నుంచి నేర్చుకున్నట్లు, తన పిల్లలకు కూడా వారసత్వంగా ఈ పానీయం తయారీనీ నేర్పిస్తున్నట్లు, ఈ ఫెస్టివల్ గురించి హైదరాబాద్ తమిళ సంఘం ద్వారా తెలుకుని గత నాలుగు సంవత్సరాలుగా పాల్గొటున్నట్లు తమిళనాడుకు చెందిన రేణుక వివరించింది.



తపియోక మసాల చిప్స్, షక్కరవరటి కేరళ స్పెషల్

తపియోక (భూచక్రం దుంప) ద్వారా తయారు చేసి మసాల చిప్స్, బెల్లంతో తయారు చేసే షక్కరవరటి కేరళ రాష్ట్రలో స్పెషల్ అని ఇది శరీరంలోని వేడిని తగ్గించడమేకాక మరెన్నో ఆరోగ్య సమస్యలను తగ్గిస్తుందని నిర్మల్‌లో ఉండే హర్ష, ఆదిలాబాద్‌లో నివసించే నియాలు వివరించారు. మలయాళీ మిషన్ ద్వారా ఈ వేడుక గురించి తెలుసుకుని ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు.

-హర్ష, నియా

కేరళ హాల్వాకి భలే డిమాండ్

పలు రకాల హాల్వలకి కేరళ ప్రసిద్ధి వివిధ రకాలు హాల్వాలు తయారు చేస్తారు. శుభకార్యాలయాల్లో తప్పని సరిగా హాల్వ వడ్డన చేస్తారు. నాలుగు రకాలు హాల్వాలు తీసుకు వచ్చాను. డిమాండ్ బాగా వుంది. అమ్మకాలు బాగున్నాయి. స్టాల్ ఏర్పాటుకి ఎటువంటి డబ్బు తీసుకోలేదు.

-అంజు వనేష్

బురాన్ ఫ్లవర్ జ్యూస్

హిమాలయాలలో ముఖ్యంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పర్వత ప్రాంతాలలో దొరికే అరుదైన పుష్పం బురాన్. దీనితో తయారు చేసే జ్యూస్‌ను ఉత్తరాఖండ్‌కు చెందిన మహిళల ప్రదర్శించారు. ఈ పానియం కీళ్ల నొప్పులు వంటి ఎన్నో ఆరోగ్య సమస్యలను నివారిస్తుందని ఇది ఉత్తరాఖండ్ రాష్ట్రం ప్రత్యేకపానియమని నగరంలోని ఉత్తరాఖండ్ సేవా సమితి ద్వారా తెలుసుకొని మొదటి సారి స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న

-ఆరోహి, ఉత్తరాఖండ్



తమిళనాడుకే ప్రత్యేకమైన ఫిల్టర్ కాఫీ

ఫిల్టర్ కాఫీ తమిళనాడుకే ప్రత్యేకమని తంజావూర్‌కు చెందిన మహేశ్వరీ పేర్కొన్నారు. తమిళ సంఘం ద్వారా ఈ ప్రదర్శన గురించి తెలుకుని హైదరాబాద్ వాసులకు అసలైన తమిళనాడు ఫిల్టర్ కాఫీ రుచి చూపించడానికి ఈ ప్రదర్శనలో భాగస్వామం పొందాన్నారు.

కనులపండువగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బౌద్ధనగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం కనులపండువగా జరిగింది. ధనుర్మాసం, సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆలయాన్ని వివిధ రకాలపుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలకరించారు. మేళతాళాలు, భాజభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభోవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో కల్యాణం తిలకించి గోదాదేవి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాల్‌రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్‌తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, అత్మరామ సూర్యసుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సుజయ్ ప్రకాశ్, షణ్ముకరావు పాల్గొన్నారు.

పతంగుల పంపిణీ



చిన్నారులకు పతంగులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకుడు ఉత్తరయ్య

సికింద్రాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మడ్‌ఫోర్ట్ గుడిసెల్లో చిన్నారులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉత్తరయ్య పతంగులు పంపిణీ చేశారు. దేవేంద్ర నారాయణ స్వామి, వేములప్ప, రవి, వెంకటయ్య, అంజీ, రంగస్వామి, నాగరాజు లక్ష్మణ్, యాదమ్మ, రజనీ, చిట్టమ్మలు పాల్గొన్నారు.



సంక్రాంతి పండుగ పురస్కరించుకుని బీజేపీ నాయకుడు మేకల చంద్రశేఖర్ రావు చిలకలగూడలో చిన్నారులకు పతంగులు పంపిణీ చేశారు.

-చిలకలగూడ, ఆంధ్రజ్యోతి



సంక్రాంతి పండగ సందర్భంగా నల్లగుట్టలో చిన్నారులకు సనత్‌నగర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ చిత్రపటం ఉన్న పతంగులను పంపిణీ చేస్తున్న సనత్‌నగర్ నియోజకవర్గ "ఏ" బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్. కార్యక్రమంలో సాదిక్, రహీం, నగరాజు, యాసిన్, రఘు, వెంకట్, విన్ను, చందు ఇతర నాయకులు పాల్గొన్నారు.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి



మంద జగన్నాథం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

మంద జగన్నాథంకు నివాళి

రాంగోపాల్‌పేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు మంద జగన్నాథంకు మాదిగ హక్కుల అభివృద్ధి పార్టీల సంఘాల ఐక్యత జేఏసీ నాయకులు నివాళులర్పించారు. సోమవారం విక్టోరియా రాణీగంజ్ చౌరస్తాలో సీనియర్ నాయకులు ఎస్సార్ మల్లేష్, మాతంగి గణేష్, బండి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కె.ఎం.కృష్ణ మాట్లాడుతూ అంకితభావంలో జాతికి సమాజానికి నిస్వార్థంగా ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బండి శాంతి కుమార్, కుర్మా లక్ష్మీపతి, శంకర్, అడ్వకేట్ మల్లికార్జున్, పుల్లూరి మహేందర్, వేణుగోపాల్, కుర్మా మహేందర్, బొడ్డు మహేష్, మాచర్ల ప్రభాకర్, జగదీష్, చంద్రశేఖర్ (బబ్బర్), స్థానికులు దర్శనం కుమార్, తాళ్లసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గాలిపటాలతో సందడి చేసిన మల్లారెడ్డి

బోయినపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పురస్కరించుకుని బోయినపల్లిలో ఎమ్మెల్యే మల్లారెడ్డి సందడి చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు టింకుగౌడ్‌లో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పతంగుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులు, యువకులకు పతంగులను పంపిణీ చేశారు. అనంతరం పిల్లలతో కలిసి మల్లారెడ్డి పతంగులను ఎగురవేస్తూ సందడి చేశారు. సంక్రాంతి పండుగంటే తనకు ఎంతో ఇష్టమని, ప్రతి సంవత్సరం పతంగులను ఎగురవేస్తానని తెలిపారు. చైనా మాంజాలను వాడవద్దని, సాధారణ ధారాలతో తయారు చేసిన మాంజాలను వాడాలని, భవనాలపై పతంగులు ఎగరవేసేటప్పుడు పూర్తిస్థాయిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాల్లారెడ్డి కోరారు.



పంతగులు ఎగరవేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కార్యక్రమంలో నాయకులు అజయ్‌కుమార్, సులేమాన్, బండి శ్రీనివాస్, సన్నిధానం సంతోష్, సూర్యభాయ్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మురళీ ముదిరాజ్

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

తిరుమలగిరి జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పండగను పురస్కరించుకొని లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో అమ్మవారి పరమ భక్తుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మురళీ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకం, అర్చన, కుంకుమార్చన, పుష్పార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని లాల్‌బజార్ పెరుమాళ్ హట్స్, శాస్త్రీ నగర్, లాల్‌బజార్ మార్కెట్, అర్జున్‌వాడ తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు భారీ సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదానంలో పాల్గొన్నారు. సభ్యులు రాజేష్, సదానంద్, సుధాకర్, మధు, జార్జ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



దినేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న హనుమంతరావు

దినేశ్ కుటుంబానికి హనుమంతరావు పరామర్శ

పద్మారావునగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొండ పోచమ్మ సాగర్ ఘటనలో ప్రమాదవశాత్తు మృతి చెందిన బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌కు చెందిన దినేశ్వర్ కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎంపీ వి.హనుమంతరావు వారి నివాసంలో పరామర్శించి, ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అండగా నిలుస్తామని అన్నారు. కాంగ్రెస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం..

రాజ్యాంగ సవరణ చేయాలి: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లను పొందుతున్న ఏ వర్గానికి విధించని క్రీమి లేయర్‌ను బీసీలకే విధించడం ఏమిటని.. దీన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాముని సుదర్శన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆర్. కృష్ణయ్య పాల్గొని మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బలమైన బీసీ ఉద్యమం చేపడితే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి పలు పథకాలను ప్రవేశపెడుతుందని సూచించారు. రిజర్వేషన్లు పెట్టింది పేదరిక నిర్మూలన కోసం కాదని సామాజిక అభివృద్ధి కోసమేనని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు, బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

కూరగాయల సాగుకు 50 శాతం సబ్సిడీ!

- రైతులను ప్రోత్సహించే దిశగా సర్కారు కీలక నిర్ణయం
- సోర, బీర తదితర తీగజాతుల ఉత్పత్తికి శాశ్వత పందిళ్లు
- ఎకరానికి రూ.3లక్షలు ఖర్చు.. సగం సర్కారే భరిస్తుంది
- ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లాలో అమలు

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగు దిశగా ఆలోచిస్తున్న రైతులకు ఇది శుభవార్తే! కూరగాయల సాగు విస్తీర్ణం పెంపు, నాణ్యమైన తీగజాతి కూరగాయల ఉత్పత్తి, తద్వారా రైతులు స్వయం సమృద్ధి సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కూరగాయలు సాగు చేసే రైతులకు వారి క్షేత్రాల్లో శాశ్వత పందిళ్లు, సాగు పరంగా మౌలిక సదుపాయాల కల్పనకు 50శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులను వినియోగించాలని సంకల్పించింది. ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో అమలు చేయాలని నిర్ణయించింది. పథకంపై అక్కడి రైతులూ ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే 360 దరఖాస్తులొచ్చాయి. వీరికి బోధన్ మార్కెట్ కమిటీ నుంచి సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. సాధారణంగా వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై మార్కెటింగ్‌శాఖ ఒక శాతం మార్కెట్ సెస్ వసూలు చేస్తుంది. ఈ నిధులను ఎక్కడికక్కడ మార్కెట్ కమిటీలు వసూలు చేస్తాయి. వీటితో ఆయా మార్కెట్ పరిధిలో బహిరంగ ప్లాట్‌ఫామ్‌లు, కవర్ షెడ్లు, గోదాములు, అంతర్గత సీసీరోడ్లు, రైతులకు విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు నిర్మిస్తుంటారు. నీరు, విద్యుత్తు సౌకర్యాలు కల్పిస్తుంటారు. రాష్ట్రవ్యాప్తంగా 192 వ్యవసాయ మార్కెట్ కమిటీలు, 87 సబ్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. మార్కెట్ సెస్ ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో ముందుగా తీగజాతి కూరగాయల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కాకర, బీర, దొండ, సోర, చిక్కుడు తదితర కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు ఎకరాకు రూ.3లక్షల దాకా ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ పందిళ్లు ఏర్పాటు చేసుకుంటే 50శాతం సబ్సిడీ ఇస్తారు. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో ఈ పథకాన్ని చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సుదర్శన్‌రెడ్డి ముందుకొచ్చారు. నియోజకవర్గంలో క్షేత్ర పర్యటనలు చేసి రైతులతో ఆయన సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ పథకం నిర్వహణపై సుదర్శన్‌రెడ్డి స్పందించారు. శాశ్వత పందిళ్లు వేసి కూరగాయలు సాగుచేస్తే ఉత్పత్తి, నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు.